సాక్షి వికారాబాద్

గురువారం : 15 : మే : 2025



రైతుకు 'గుర్తింపు'

దౌల్తాబాద్ మండలంలో రైతు రిజిస్ట్రీ అమలు ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. 10లో▸



విద్యుత్ సరఫరా అస్తవ్యస్తం!

నవాబుపేట మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. 11లో▸



ఆధ్యాత్మికతతో..

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

పంట మార్పిడితో లాభాలు

శాస్త్రవేత్తలు లక్ష్మణ్, రాజేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

కొడంగల్ రూరల్: వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు పాటిస్తూ రైతులు అధిక దిగుబడులు సాధించాలని తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త టి.లక్ష్మణ్, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త టి.రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రుద్రారం గ్రామ రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అధికంగా యూరియా వాడడంతో మట్టిలో జీవశక్తి తగ్గిపోతుందని, దీర్ఘకాలికంగా ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం పడుతుందని చెప్పారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే క్రమంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటలు నష్టపోయే క్రమంలో పరిహారం పొందేందుకు వీలుంటుందన్నారు. అధిక దిగుబడులు సాధించాలంటే ముందుగా పంట మార్పిడి పద్ధతులు పాటించాలని, దీంతో భూమిలో పండించే శక్తి మెరుగు పడుతుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ తులసి, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, గ్రామస్తులు ఆనంద్‌రెడ్డి, సాయిలు, హన్మయ్య, వెంకటయ్యగౌడ్, ఏఈఓలు శ్రీపతిరెడ్డి, సుమ, పావని, అశ్విని, రాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే భవిష్యత్

మైనారిటీ గురుకులాల జిల్లా రీజనల్ లెవల్ కన్వీనర్ వినోద్ ఖన్నా



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న వినోద్ ఖన్నా తదితరులు

తాండూరు టౌన్: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేయడం అభినందనీయమని మైనారిటీ గురుకులాల జిల్లా రీజనల్ లెవల్ కన్వీనర్ వినోద్ ఖన్నా అన్నారు. బుధవారం ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో ముస్లిం వెల్ఫేర్ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 90 మంది ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా యువత చేతుల్లోనే ఉందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో యువత తాము ఎంచుకున్న రంగంలో రాణించాలన్నారు. ఎండబ్ల్యూఎస్‌డీఎస్ ఆధ్వర్యంలో యువతులకు టైలరింగ్, మెహిందీ డిజైన్‌లలో శిక్షణ, విద్యార్థులకు ఎప్‌సెట్, టెట్, డీఎస్సీ వంటి వాటిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేయడం వల్ల వారిలో ప్రోత్సాహాన్ని నింపిన వారవుతారన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమాల్ అతర్, ఎండబ్ల్యూఎస్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ యూనస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అబ్దుల్ ఖయ్యూం అతర్, నాయకులు అబ్దుల్ రవూఫ్, ఫారూఖ్ సాహిల్, బాబర్, అబ్దుల్ ఘని, పలు పాఠశాలల ప్రతినిధులు అజార్, షకీల్ ఉమ్రి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పీఎస్‌కు వచ్చేవారితో మర్యాదగా మెలగాలి

కడ్తాల్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించడంతోపాటు సమస్యలను వెంటనే పరిష్కరించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. కడ్తాల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలను పాటిస్తూ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ సమాజంలో పోలీసుల గౌరవాన్ని పెంచాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ గస్తీ పెంచాలని ఆదేశించారు. డయల్ 100కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్ఐ శివశంకర వరప్రసాద్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మూడేళ్లు 5,235 కేసులు

జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న కుక్కకాట్లు

జిల్లాలో కుక్కకాటు కేసులు

సంవత్సరం		బాధితుల సంఖ్య
2023	–	1,902
2024	–	2,325

ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు 1,006 మంది

- ఆస్పత్రి పాలవుతున్న బాధితులు
- తాజాగా పరిగి మండలంలో పిచ్చికుక్క దాడి
- ఐదుగురు చిన్నారులకు గాయాలు
- నియంత్రణలో ప్రభుత్వ యంత్రాంగం విఫలం





తాండూరులోని ఓ కాలనీలో కుక్కల సంచారం (ఇన్‌సెట్‌లో) శునకాలను పట్టుకుంటున్న సిబ్బంది

తాండూరు: కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన నీలం మధు, లావణ్య దంపతులు. ఉపాధి కోసం తాండూరుకు వలస వచ్చి పట్టణ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి ఆరు నెలల బాలుడు సాయినాథ్ ఉండేవాడు. గతేడాది నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లో పని చేస్తున్న భర్తకు తాగునీరు ఇచ్చేందుకు లావణ్య కొడుకును నిద్రపుచ్చి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి వీధి కుక్క ఇంట్లోకి చొరబడి చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. రక్తపు మడుగులో ఉన్న బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మరణించాడు. పెళ్లయిన నాలుగేళ్లకు పుట్టిన కొడుకు ఊర కుక్క దాడితో మరణించడంతో ఆ తల్లిదండ్రుల కడుపుకోత వర్ణనాతీతం. ఇలాంటి ఘటనలు జిల్లాలో సర్వసాధారణమైపోయాయి. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా కనిపిస్తే చాలు కుక్కలు దాడులకు తెగబడుతున్నాయి. వాటి నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

రికార్డు స్థాయిలో..

జిల్లాలో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ పెరిగిపోతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా కుక్కలు రెచ్చిపోతూ దాడులకు తెగబడుతున్నాయి. తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. 2023 నుంచి 2025 ఏప్రిల్ నెల వరకు 5,235 కుక్కకాటు కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తప్పని తంటాలు

గతంలో కుక్కకు ఉన్నంత విశ్వాసం మనిషికి లేదు అనే నానుడు వినిపించేది. ఇటీవల కుక్కలు అంటేనే జనాలు దూరంగా పరిగెడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రతి ఇంట్లో కుక్క కనిపించేది. ప్రస్తుతం వాటి ఆదరణ పూర్తిగా పడిపోయింది. అందుకు బొచ్చు కుక్కలు, హచ్ కుక్కలు, పలు రకాల హైబ్రిడ్ కుక్కలు మార్కెట్‌లోకి వచ్చాయి. చూడటానికి అందంగా కనిపించడంతో రూ.వేలు – లక్షలు వెచ్చించి పేద, గొప్ప అనే తేడా లేకుండా పెంచుకుంటున్నారు. దీంతో స్థానికంగా ఉన్న కుక్కలన్నీ వీధి శునకాలుగా మారిపోయాయి. అవి కరిచినా, గోళ్లతో రక్కిన ప్రమాదమే. కుక్కలను దగ్గరకు తీసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఆహారం తీసుకునేటప్పుడు శబ్దం చేయకూడదు, కుక్కలు పోట్లాడుకునే సమయంలో దగ్గరకు వెళితే ప్రమాదం తప్పదు. వాహనాలపై ప్రయాణించేటప్పుడు సైరన్, హారన్ మోగిస్తే మీదకు వచ్చి కరుస్తాయి.

పెరుగుతున్న రేబిస్ కేసులు

జంతువుల కాటుతో రేబిస్ వ్యాధి సంక్రమిస్తోంది. ఈ వైరస్ ప్రధానంగా కుక్క, కోతి, పిల్లి కరిస్తే సోకుతోంది. పెంపుడు జంతువైనా, వీధి జంతువైనా వైరస్ ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాండూరులోని జిల్లా ఆస్పత్రిలో ప్రతి నెలా సుమారు 250 నుంచి 280 మంది కుక్కకాటుకు గురై చేరుతున్నారు. మరోవైపు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో సైతం భారీగా కేసులు నమోదవుతున్నాయి. శునకాల దాడితో రేబిస్ వైరస్ బారిన పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్న జిల్లా యంత్రాంగం మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం గమనార్హం. తాండూరు మున్సిపల్ పరిధిలో 1,200 కుక్కలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వీటికోసం షెల్టర్ హోమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. సంతాన నియంత్రణ కోసం 450 మగ కుక్కలను పట్టి ఆపరేషన్ చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి తెలిపారు. ఆపరేషన్ అనంతరం కుక్కలను అవి ఉన్న నివాస ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



కుక్క కాటుకు గురైన వారు వచ్చిన వెంటనే ప్రాథమిక వైద్యం అందిస్తాం. కాటు తీవ్రతను బట్టి వైద్య సేవలు చేస్తాం. రేబిస్ వైరస్‌కు సంబంధించిన వాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన వెంటనే గాయంపై నీటి ధార కింద ఉంచి సబ్బుతో శుభ్రం చేయాలి. గోరు వెచ్చని నీటిని 10 నిమిషాల పాటు గాయంపై పోయాలి. రక్తం కారకుండా తుడవాలి. గాయంపై స్టైరైల్ బ్యాండేజీ చుట్టాలి. యాంటి బయోటిక్ క్రీమ్ ఉంటే రాయాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించాలి. కరిచిన కుక్క మంచిదా.. పిచ్చిదా అని గుర్తించి వైద్య సేవలు పొందాలి.

– డాక్టర్. డీ.రవిశంకర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

భూ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- కేరెల్లి, కుక్కింద గ్రామాల్లో భూ భారతి అవగాహన సదస్సులు

ధారూరు: భూ భారతి అవగాహన సదస్సుల్లో రైతులు ఇచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని కేరెల్లి, కుక్కింద గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం కొత్త చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. భూముల వివరాల్లో తప్పులు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలోనే పరిష్కరించుకోవచ్చని సూచించారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఇకపై కోర్టుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే చాలన్నారు. అధికారులు రైతులు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలి క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. భూ భారతి చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్లు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరించాలి

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు విధిగా ఉండాలని, నిర్వాహకులు రైతులను వేధించకుండా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి గట్టెపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో జాప్యం చేయరాదని సూచించారు. లక్ష్యానికి అనుగుణంగా వడ్లు సేకరించాలన్నారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు.

ఇందిరమ్మ ఇంటి పనుల పరిశీలన

మండలంలోని అవుసుపల్లిలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. గ్రామానికి ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయని, ఎన్ని నిర్మాణ దశలో ఉన్నాయని ఎంపీడీఓ నర్సింహులును అడిగారు. గ్రామానికి 117 ఇళ్లు మంజూరు కాగా ఏడు పునాదుల పనులు పూర్తయినట్లు వివరించారు. మరో ఐదు నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. తనకు పింఛను వస్తున్నందున హౌసింగ్ డీఈ ఇంటి నిర్మాణ పనులను ఆపేశారని గ్రామానికి చెందిన సోమారం అశోక్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే బిల్లు మంజూరు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సమయంలో పాత ఇళ్ల వద్ద ఫొటోలు దిగామని, అయితే తమకు మరోచోట స్థలాలు ఉన్నందున అక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని పలువురు కలెక్టర్‌ను అభ్యర్థించగా సానుకూలంగా స్పందించారు. గ్రామ పంచాయతీ నుంచి స్థలానికి సంబంధించిన పత్రాలు తీసుకొని ఎంపీడీఓకు అందజేయాలని సూచించారు. తాను పునాది పనులు పూర్తి చేసుకున్నా పాత గోడ ఉన్న కారణంగా బిల్లు ఆపేశారని న్యాయం చేయాలని ఓ వ్యక్తి కలెక్టర్‌ను వేడుకున్నాడు. బిల్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కేరెల్లి గ్రామంలో రైతు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

17లోగా దరఖాస్తు చేసుకోండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్



అనంతగిరి: తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) నుంచి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు అన్ని మీ సేవ కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఇంటర్‌లో గణితం ఒక అంశంగా ఉండాలన్నారు.(కనీసం 60శాతం మార్కులు సాధించిన వారు), ఐటీఐ డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్) డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మే 26 నుంచి జూలై 26వ తేదీ వరకు పని దినాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కర్ణాటక ధాన్యాన్ని కట్టడి చేయండి

- సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలి
- ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్: తెలంగాణ – కర్ణాటక సరిహద్దులోని చెక్‌పోస్టుల్లో నిఘాను పెంచాలని ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని కొత్లాపూర్ సరిహద్దులోని చెక్‌పోస్టును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాగుతున్నందున కర్ణాటక నుంచి వడ్లు వచ్చే అవకాశం ఉందని పటిష్ట నిఘా పెట్టాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో కర్ణాటక ధాన్యం జిల్లాలోకి రావొద్దన్నారు. మత్తు పదార్థాలు తరలించే వ్యక్తులపై నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నాగేశ్, ఎస్ఐ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసుల వివరాల గురించి ఎస్ఐ శ్రీధర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ సూచించారు.



కొత్లాపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన



పరిగి పట్టణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అధికారులు

- ఆ దిశగా ప్రభుత్వం కృషి
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణంలో రూ.200 కోట్లతో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గణపతిరెడ్డితో బుధవారం భూ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని కులాలు, మతాలకు సంబంధించి విద్యార్థులు ఒకే చోట విద్యనభ్యసించాలని ఉద్దేశంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. తుంకుల్‌గడ్డలో అన్ని వసతులతో పాఠశాల భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, వైస్ చైర్మన్ అయూబ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు ఆంజనేయులు, చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

సీఎం సహాయ నిధిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని రాపోల్ గ్రామానికి చెందిన తిరుపతి అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేస్తుకున్నాడు. బాధితునికి రూ.1.28 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాపోల్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట షురూ..

అనుమతులకు ముందే అడ్మిషన్ల కోసం ప్రైవేటు స్కూళ్ల క్యాంపెయిన్



- సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులు
- అర్హతలేని వారితో బోధన
- అనుమతులు లేని పాఠశాలలే అధికం
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు
- నామమాత్రంగా బడిబాట కార్యక్రమం

వికారాబాద్: ఎప్పటిలాగే అడ్మిషన్ల కోసం ప్రైవేటు పాఠశాలలు ప్రయత్నాలు ప్రారంభించాయి. విద్యార్థుల తల్లిదండ్రులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. స్టేట్, సెంట్రల్ సిలబస్ పేరిట అధిక ఫీజులకు తెర తీశాయి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ఇప్పటి నుంచే అడ్మిషన్లు కోసం క్యాంపెయిన్ చేస్తున్నారు. అడ్మిషన్ల విషయంలో ఎలాంటి నిబంధనలు పాటించడంలేదు. జిల్లాలో మెజార్టీ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నావే. అలాంటి వాటిపై రిమార్కులు రాసి పంపుతున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా పైనుంచి అనుమతులు ఆగడం లేదు. జిల్లాలో దాదాపు 220 వరకు ప్రైవేటు స్కూళ్లు ఉండగా ఇందులో 10 శాతం మినహా మిగతా వారందరూ నిబంధనలకు నీల్లొదిలిన వారే. పలు పాఠశాలల్లో కిటికీలు లేని తరగతి గదులే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ఉన్న వాటికి ప్రహరీలు సైతం లేవు. కానీ పోలీసులు ట్రాఫిక్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఇలా ఆయా శాఖల అధికారులు మామూళ్లకు ఆశపడి అనుమతులు ఇస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

వసతులు నిల్.. ఫీజులు ఫుల్

ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం విద్యను వ్యాపార ధోరణిగా మార్చేశాయి. ఎవరికి తోచినట్లు వారు ఫీజులు వసూలు చేస్తున్నారు. సౌకర్యాల కల్పనలో మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. డొనేషన్లు వసూలు చేయరాదన్న నిబంధనను తుంగలో తొక్కుతున్నారు. వేల రూపాయలు డొనేషన్ల పేరిట దండుకుంటున్నా అడిగే నాథులే లేరు. ఫీజుల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు ఆయా పాఠశాలలు సంవత్సరానికి రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. కొన్ని స్కూళ్లలో ఎల్‌కేజీకే ఏకంగా రూ.50 వేలు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మూడు నుంచి పది రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. అధిక ఫీజులు, సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన సమయంలోనే విద్యాశాఖ స్పందించడం ఆనవాయితీగా మారింది. ఏటా ఫీజులు పెంచేస్తున్నా అడిగేవారు లేరు. జిల్లాలోని పది శాతం పాఠశాలలకే ఆట స్థలాలు ఉన్నాయి. ఉపాధ్యాయుల నియామకంలో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఇంటర్, అంతకంటే తక్కువ విద్యార్హత ఉన్నవారితో బోధన చేయిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఏటా బడిబాట కార్యక్రమం నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలో అలాంటి కార్యక్రమాలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రైవేటు స్కూళ్లలో నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వ పాఠశాలలకు వర్తించే నిబంధనలే ప్రైవేటు స్కూళ్లకు వర్తిస్తాయని అధికారులు చెబుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. పాఠశాలల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికెట్లు అందజేయాలని నోటీసులు పంపినా స్పందించడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, షూ వంటివి విక్రయించరాదు. కానీ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి దర్జాగా విక్రయిస్తున్నారు.

క్లుప్తంగా

కల్తీ సరుకుల తరలింపు
తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పోలీసులు


పట్టుబడిన అల్లంపేస్ట్‌, మంచినూనె

కొడంగల్‌ రూరల్‌: కల్తీ సరుకులతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో మంగళవారం రాత్రి తనిఖీ చేస్తున్న క్రమంలో హైదరాబాద్‌ నుంచి రావులపల్లి వైపు వెళ్తున్న వాహనంలో అక్రమంగా 1500 కేజీల అల్లం పేస్ట్‌, 1500 లీటర్ల మంచినూనెను తరలిస్తున్నారని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం సరుకులను పరిశీలించగా అవి దుర్వాసన కలిగి ఉన్నాయని తెలిపారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ బాధితులకు పరిహారం చెల్లించండి
సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌

తాండూరు టౌన్‌: తాండూరు బైపాస్‌ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రజల నుంచి తీసుకున్న భూములకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్‌ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో బైపాస్‌ రోడ్డు కోసం అంతారం, కోకట్‌ తదితర ప్రాంతాల పరిధిలో భూసేకరణ చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం సైతం భూమి కోల్పోయిన వారికి పరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, లేకపోతే ఈనెల 19వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి
చేపలు పట్టేందుకు వెళ్లిన ఒడిశావాసి దుర్మరణం


సుశాంత్‌మంగరాజ్‌

అనంతగిరి: చేపలు పట్టేందుకు వెళ్లిన వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. సీఐ భీంకుమార్‌ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్‌ బిష్టుపూర్‌కు చెందిన సుశాంత్‌ మంగరాజ్‌(47) శివారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 12న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తెలిసిన వారివద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో శివారెడ్డిపేట చెరువులో గుర్తు తెలియని శవం ఉందని తెలియడంతో అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులు సుశాంత్‌గా గుర్తించారు. మృతుని కుమారుడు రాకేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నామని సీఐ తెలిపారు.

'పోలీసులతో ప్రాణభయం'
హెచ్‌ఆర్సీని ఆశ్రయించిన బాధితుడు

మొయినాబాద్‌: 'పోలీసులతో నాకు ప్రాణభయం ఉంది.. భూ వివాదంలో తలదూర్చి దగ్గరుండి ప్రీ కాస్ట్‌ గోడను తొలగించారు. అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు నాపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు' అని నాగిరెడ్డిగూడకు చెందిన సంతపురం అనిల్‌ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. తన తండ్రి నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు. దీంతో తనకు సగం వాటా ఇస్తూ 2024 జూన్‌ 6న కోర్టు ఫైనల్‌ డిక్రీ ఇచ్చిందని తెలిపారు. దీని ప్రకారం 2025 మార్చి 13న కొత్త పట్టాదారు పాసుపుస్తకం వచ్చిందన్నారు. కోర్టు ద్వారా వచ్చిన భూమి చుట్టూ నెల రోజుల క్రితం ప్రీకాస్ట్‌ వాల్‌ నిర్మించుకున్నామన్నారు. ఏప్రిల్‌ 21న అర్ధరాత్రి సుమారు 30 మంది పోలీసులు, కొంత మంది వచ్చి గోడను ధ్వంసం చేశారని, తనపై తప్పుడు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారని వివరించారు. పోలీసుల తీరును తప్పుపడుతూ జడ్జి మందలించడంతో 41 నోటీసులు ఇచ్చి పంపించారని తెలిపారు. ఇటీవల మళ్లీ పోలీస్‌ స్టేషన్‌కు రావాలంటూ వేధిస్తున్నారన్నారు. ఇది భరించలేక మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. దీనిపై మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. భూమిని కొనుగోలు చేసిన వారు ఇరవై ఏళ్లుగా కబ్జాలో ఉన్నారని, వారు నిర్మించిన ప్రహరీ, చెట్లను ధ్వంసం చేయడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

అక్కడ ట్రైనింగ్‌... ఇక్కడ యాక్షన్‌!

> ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా భారత బలగాలు ధ్వంసం చేసిన తొమ్మిది ఉగ్రవాద క్యాంపుల్లో మురిద్కేలో ఉన్న లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) టెర్రర్‌ ఫ్యాక్టరీ కూడా ఉంది. లాహోర్‌ సమీపంలో నియంత్రణ రేఖకు 30 కిమీ దూరంలో ఉన్న ఈ కీలక క్యాంప్‌ను మర్కజ్‌ తోయిబా అని పిలుస్తారు. దీనితో హైదరాబాద్‌కు అనేక లింకులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిన, ఇక్కడ పట్టుబడిన అనేక మంది ఉగ్రవాదులు, సానుభూతిపరులు మర్కజ్‌ తోయిబాలో శిక్షణ పొందడమో, అక్కడ జరిగే వార్షిక సమావేశాల్లో పాల్గొనడమో చేసిన వాళ్లే. 1993 నాటి జలీస్‌ అన్సారీ, 1998లో చిక్కిన పాకిస్థానీ సలీం జునైద్‌ నుంచి ఇప్పటికీ మోస్ట్‌ వాంటెడ్‌గా ఉన్న కుర్మగూడకు చెందిన ఫర్హాతుల్లా ఘోరీ వరకు ఈ కోవకు చెందిన వాళ్లే.
> – సాక్షి, సిటీబ్యూరో

మురిద్కేలో ధ్వంసమైన ఎల్‌ఈటీ 'టెర్రర్‌ ఫ్యాక్టరీ'
- 'సిటీ ఉగ్రవాదుల్లో' పలువురికి అది సుపరిచితం
- జలీస్‌ అన్సారీ నుంచి ఫర్హాతుల్లా ఘోరీ వరకు...
- నగరంలో జరిగిన విధ్వంసాలకు అక్కడే కుట్రలు

1993 నుంచి లింకులు...
ఐఎస్‌ఐ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్‌ఈటీ ఉగ్రవాద సంస్థ 1987లో ప్రారంభమైంది. దీని ఛాయలు నగరంలో 1993 నుంచీ ఉన్నాయి. ముంబైకి చెందిన జలీస్‌ అన్సారీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్‌ కరీం టుండా, కోల్‌కతాకు చెందిన అబ్దుల్‌ మసూద్‌, వరంగల్‌కు చెందిన ఆజం ఘోరీ తన్జీమ్‌ ఇస్లాహుల్‌ ముస్లిమీన్‌ (టీఐఎం) పేరుతో ఓ ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేశారు. 1993లో నగరంలోని అబిడ్స్‌, నాంపల్లి, సికింద్రాబాద్‌, హుమాయున్‌నగర్‌, మౌలాలీల్లో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆజం ఘోరీతో (2000లో జగిత్యాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు) పాటు మిగిలిన ముగ్గురూ మర్కజ్‌ తోయిబాలో శిక్షణ పొందిన వారే. 1998లో పాకిస్తాన్‌ నుంచి పాతబస్తీకి వచ్చి, ఇక్కడి యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తూ సలీం జునైద్‌ పట్టుబడ్డాడు. ఇతడూ అదే టెర్రర్‌ క్యాంప్‌లో శిక్షణ పొందిన వాడే.

మరో సంస్థ ఏర్పాటు చేసిన ఆజం ఘోరీ...
టీఐఎం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఆజం ఘోరీ 1999లో ఇండియన్‌ ముస్లిం మహ్మదీయ ముజాహిదీన్‌ (ఐఎంఎంఎం) ఏర్పాటు చేశాడు. నగరంలోని ఆరు ప్రాంతాలతో పాటు విజయవాడ, బోధన్‌, నిజామాబాద్‌ల్లోనూ విధ్వంసాలు సృష్టించిన ఈ మాడ్యూల్‌లోని అనేక మంది మురిద్కే వరకు వెళ్లి శిక్షణ పొంది వచ్చిన వాళ్లే. 2001లో గణేష్‌ నిమజ్జనంలో పేలుళ్లకు కుట్ర పన్నిన అబ్దుల్‌ అజీజ్‌ అలియాస్‌ గిడ్డా అజీజ్‌, 2002లో దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబ దేవాలయం వద్ద పేలుడుకు పాల్పడిన ఆజం, అజీజ్‌ తదితరులు, 2004లో సికింద్రాబాద్‌లోని గణేష్‌ టెంపుల్‌ పేల్చివేతకు కుట్ర పన్నిన నసీరుద్దీన్‌ మాడ్యూల్‌, 2005లో నగర వ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన నవీద్‌ మాడ్యూల్‌... వీటన్నింటి వెనుక ఎల్‌ఈటీనే ఉంది. ఈ విధ్వంసాలు, కుట్రలకు పథక రచన చేసి, పాల్గొన్న వారిలో అత్యధికులు మురిద్కే వరకు వెళ్లి మర్కజ్‌ తోయిబాను 'చూసి' వచ్చిన వాళ్లే.


భారత బలగాల దాడిలో ధ్వంసమైన పాకిస్తాన్‌లోని మురిద్కే


ఆజం ఘోరీ ఫర్హాతుల్లా అబ్బు అజీజ్‌ అబ్దుల్‌ కరీం టుండా జలీస్‌ అన్సారీ

సౌదీలో ఉద్యోగాల పేరుతో ఎర వేసి...
నగర యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించే ఎల్‌ఈటీ, దాని అనుబంధ సంస్థల నిర్వాహకులు వారిని నేరుగా మర్కజ్‌ తోయిబాకు చేర్చలేదు. ఎల్‌ఈటీ స్లోగన్స్‌లో 'హైదరాబాద్‌ లిబరేషన్‌' కూడా కీలకం కావడంతో నగరం, కాన్పూర్‌లకు చెందిన యువతనే ఎక్కువగా ఆకర్షించే వాళ్లు. వీరిని ఉద్యోగాల పేరుతో సౌదీకి తీసుకువెళ్లి అక్కడి నుంచి మురిద్కే పంపేవాళ్లు. ఉగ్రవాద శిక్షణ పూర్తయిన తర్వాత బంగ్లాదేశ్‌, నేపాల్‌ మీదుగా హైదరాబాద్‌ చేర్చేవాళ్లు. మర్కజ్‌ తోయిబాలో ఉన్న ట్రైనర్లకూ నగరంపై మంచి పట్టు ఉండేది. శిక్షణ కోసం వెళ్లిన యువతతో ఉర్దూలో మాట్లాడటం, సిటీలో ఉన్న కీలక ప్రాంతాల వివరాలు అడగటం చేసే వాళ్లు. చిక్కిన ముష్కరులు, వారి సానుభూతిపరుల విచారణలో ఈ విషయం గుర్తించిన నిఘా వర్గాలు ఆ ట్రైనర్లు ఇక్కడ సంచరించి వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.

ఫర్హాతుల్లా పాత్ర అత్యంత కీలకం...
ఎల్‌ఈటీతో పాటు మర్కజ్‌ తోయిబాలోనూ కూర్మగూడ వాసి ఫర్హాతుల్లా ఘోరీ పాత్ర అత్యంత కీలకమని నిఘా వర్గాలు చెప్తున్నాయి. 1998లోనే ఉగ్రవాదం వైపు మళ్లిన ఇతగాడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2002లో గుజరాత్‌లోని అక్షర్‌ధామ్‌ దేవాలయంపై జరిగిన దాడి కేసుతో ఇతని వ్యవహారాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. 2004లో నగరం కేంద్రంగా బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు కుట్ర జరిగింది. ఘోరీ అప్పట్లో పాక్‌ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైషేమహ్మద్‌కు (జేఈఎం) సానుభూతిపరుడిగా ఉండి ఈ కేసులోనూ నిందితుడిగా మారాడు. ఆ తర్వాత 2005లో టాస్క్‌ఫోర్స్‌ కార్యాలయంపై జరిగిన మానవబాంబు దాడి కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. 2012 నాటి బెంగళూరు 'హుజీ కుట్ర' కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. 2022లో దసరా నేపథ్యంలో విధ్వంసాలకు కుట్రపన్ని హ్యాండ్‌ గ్రెనేడ్స్‌తో సహా చిక్కిన 'ఉగ్ర త్రయం'లో కీలకమైన జాహెద్‌తోనూ సంబంధాలు కలిగి ఉన్నాడు. ఇతను గత ఏడాది వరకూ మర్కజ్‌ తోయిబాలో జరిగే వార్షిక సమావేశాలకు హాజరయ్యాడు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి
మిట్టకోడూర్‌ గ్రామంలో విషాదం


వినయ్‌ (ఫైల్‌)

పరిగి: ఈత సరదా ఓ కుటుంబాన్ని దుఃఖసాగరంలో ముంచింది. స్నేహితులతో కలిసి చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మిట్టకోడూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐనాపురం శ్రీనివాస్‌, రేణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు వినయ్‌(9) నాలుగో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి చెరువులో ఈతకు వెళ్లారు. అందులో గుంతలు ఉండడం, వినయ్‌కి ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. తోటి స్నేహితులు గమనించి బయటకు వెళ్లి ఇంటికి పరుగులు తీశారు. దారిన ఓ వ్యక్తి వెళ్తుంటే వినయ్‌ చెరువులో మునిగిపోయాడని చెప్పారు. దీంతో గ్రామస్తులు చెరువు దగ్గరకు వెళ్లి వెతకగా అప్పటికే మృతి చెందాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య
తాండూరు రూరల్‌: బావిలో దూకి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుంతబాసుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌ రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు రమేష్‌(36) కూలీ పనులు చేసుకుంటు జీవిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం పెద్ద భార్య, కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ తర్వాత దేవిబాయిని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ బాబు కూడా ఉన్నాడు. కొంతకాలంగా ఇద్దరు బాగానే ఉన్నారు. నెల రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో దేవిబాయి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఎటో వెళ్లిపోయాడు. బుధవారం మిట్టబాసుపల్లి గ్రామ శివారులో బావిలో మృతదేహం లభ్యమైన విషయాన్ని రమేష్‌ కుటుంబ సభ్యులకు స్థానికులు చెప్పారు. వారు వచ్చి రమేష్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి నర్సింగ్‌ నాయక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్య


జాస్మిన్‌ (ఫైల్‌)

నాగోలు: భర్త వేధింపుల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్‌ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఖమ్మం పట్టణానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు కుమార్తె జాస్మిన్‌(29)కు ఎల్‌బీనగర్‌, శివపురి కాలనీ చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ పెండెం రాజశేఖర్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. 25 లక్షల నగదు, 20 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహం జరిగిన కొన్నాళ్లకే రాజశేఖర్‌, అతడి కుటుంబ సభ్యులు జాస్మిన్‌ను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు ఆమెకు నచ్చజెప్పి కాపురానికి పంపించారు. అయినా తన వైఖరి మార్చుకోని రాజశేఖర్‌ కొన్నాళ్లకే జాస్మిన్‌ను కొట్టి పుట్టింటికి పంపించాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం మహిళా పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌ను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. మంగళవారం ఆఫీస్‌కు వెళ్లిన రాజశేఖర్‌ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. జాస్మిన్‌ను పిలిచినా స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగలకొట్టి చూడగా జాస్మిన్‌ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో అతను ఎల్‌బీనగర్‌ పోలీసులు, జాస్మిన్‌ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. జాస్మిన్‌ శరీరంపై గాయాలను గుర్తించిన ఆమె కుటుంబ సభ్యులు రాజశేఖర్‌ ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు వచ్చి గుండెపోటుతో మృతి


ఇర్ఫాన్‌ మృతదేహం

రాజేంద్రనగర్‌: భార్యభర్తల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో కౌన్సెలింగ్‌ కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్‌ ఇన్‌స్పెక్టర్‌ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్‌ దర్గా ఖలీజ్‌ ఖాన్‌ ప్రాంతానికి చెందిన మహ్మద్‌ ఇర్ఫాన్‌ (35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి ఇద్దరూ భార్యలు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా అతను మరో మహిళతో ఉంటున్నాడు. ఈ విషయమై రెండో భార్య ఇషాద్‌ బేగం రాజేంద్రనగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు భార్యభర్తలను మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చిన అనంతరం ఇంటికి వెళ్లాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌ నుంచి బయటికి రాగానే ఇర్ఫాన్‌ రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు అతడిని అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించచిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇర్ఫాన్‌ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యను కడతేర్చిన భర్త
అనుమానంతో హత్య


నాజియా బేగం(ఫైల్‌)


జాకీర్‌ అహ్మద్‌

పహాడీషరీఫ్‌: అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను కిరాతకంగా హత్య చేసిన ఘటన బాలాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ఎం.సుధాకర్‌, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ ప్రాంతానికి చెందిన జాకీర్‌ అహ్మద్‌, నాజియాబేగం(30) దంపతులు. వీరికి ఒక కూతురు, ఇద్దరు కొడుకులు సంతానం. ఆటో నడుపుతూ జీవనం సాగించే జాకీర్‌ సంపాదనతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో నాజియా ప్రైవేట్‌ జాబ్‌ చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమెపై అనుమానం పెంచుకున్న జాకీర్‌ తన మకాంను ఈనెల 1న బాలాపూర్‌ ఠాణా పరిధిలోని కొత్తపేట న్యూ గ్రీన్‌సిటీ కాలనీకి మార్చాడు. మంగళవారం అర్ధరాత్రి భార్యతో గొడవపడి కర్రతో తలపై మోది, గొంతుకు చున్నీ బిగించి హత్యచేశాడు. అక్కడి నుంచి పారిపోయి, బుధవారం ఉదయం అత్త రుబీనాబీకి ఫోన్‌ చేసి చెప్పాడు. తల్లి, కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా నాజియా అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

యువకుడి బలవన్మరణం


ప్రవీణ్‌ కుమార్‌(ఫైల్‌)

హిమాయత్‌నగర్‌ : ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బాల్యతండాకు చెందిన ధరావత్‌ రాందాస్‌ కుమారుడు ధరావత్‌ ప్రవీణ్‌ కుమార్‌(20) నారాయణగూడలోని అభ్యశ్రీ బాయ్స్‌ హాస్టల్‌లో ఉంటూ జేఈఈ మెయిన్స్‌కు కోచింగ్‌ తీసుకుంటున్నాడు. రెండుసార్లు ప్రయత్నించినా ర్యాంక్‌ రాకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను ఈనెల 12న తల్లిదండ్రులకు ఫోన్‌ చేసి బాధపడగా వారు అతడికి సర్దిచెప్పారు. మంగళవారం తల్లిదండ్రులు ప్రవీణ్‌కు ఫోన్‌ చేయగా అతను ఫోన్‌ లిఫ్ట్‌ చేయలేదు. దీంతో ఆందోళనకు గురైన వారు బుధవారం ఉదయం హాస్టల్‌కు వెళ్లి చూడగా ప్రవీణ్‌ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

నమ్మించి మోసం చేశాడు...

- భార్యతో విడాకులు తీసుకుంటున్నానని చెప్పి..
- డాక్టర్‌తో ప్రేమాయణం..
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి..
- గర్భం దాల్చిన వైద్యురాలు..
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బంజారాహిల్స్‌: నా తల్లితో ఆస్తి గొడవలు ఉన్నాయి..నా భార్య నాతో సఖ్యంగా ఉండదు..అందుకే విడాకులు తీసుకుంటున్నాం..అందుకు సంబంధించిన విడాకులు పత్రాలు ఇవిగో అంటూ వైద్యురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. చివరకు సదరు వైద్యుడి అసలు నిజ స్వరూపం తెలియడంతో తాను మోసపోయానని బంజారాహిల్స్‌ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే..ఢిల్లీకి చెందిన భరత్‌ గెరా నగరంలోని కొండాపూర్‌ ప్రైమ్‌ స్ప్లెండర్‌లో ఉంటూ బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2లోని డెరెడియా లైఫ్‌ సైన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌లో హెచ్‌ఆర్‌ ఆపరేషనల్‌ హెడ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ఓ వైద్యురాలితో అతడికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో భరత్‌ సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు తనకు గతంలోనే వివాహం జరిగిందని, తన భార్యతో గొడవల కారణంగా విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. న్యాయవాది ఎదుట ఇద్దరూ సంతకం చేసిన పత్రాలను కూడా ఆమెకు చూపించాడు. తన తల్లికి తనకు ఆస్తి గొడవలు ఉన్నాయని, తల్లి, సోదరుడు ఢిల్లీలో ఉంటారని చెప్పాడు. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ పనిపై చండీఘడ్‌ వెళుతున్న భరత్‌ సదరు వైద్యురాలిని కూడా తీసుకెళ్లి అక్కడ హోటల్‌ రూంలో బస చేశారు. ఆ సమయంలో భరత్‌ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత భరత్‌ను కంపెనీ యాజమాన్యం ఉద్యోగంలో నుంచి తొలగించగా, అతడితో పాటు సదరు యువతి కూడా ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇద్దరూ కలిసి సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పెట్టుబడి నిమిత్తం ఆమె నుంచి భరత్‌ రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. అంతేగాక భరత్‌ సదరు యువతి ఫోన్‌లో లోకేషన్‌ను ట్రాక్‌ చేసి ఆమె ఎక్కడికి వెళ్తుందని ఆరా తీయడం మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె భరత్‌తో మాట్లాడేందుకు అతని ఇంటికి వెళ్లగా అతడి భార్య ఇంట్లో ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. ఆరు నెలల గర్భవతిగా ఉన్న అతని భార్య కూడా వైద్యురాలిని అసభ్యంగా దూషించడమేగాక వివాహితుడితో ఎందుకు సంబంధం కొనసాగిస్తున్నావంటూ నిలదీసింది. ఆ తర్వాత భరత్‌, అతని భార్య పూణెకు మకాం మార్చారు. కొన్ని రోజుల తర్వాత గర్భం దాల్చిన బాధితురాలు భరత్‌ తనను శారీరకంగా, ఆర్థికంగా వాడుకుని మోసం చేశాడంటూ బంజారాహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుకు 'గుర్తింపు'

- మండలంలో ఫార్మర్‌ రిజిస్ట్రీ ప్రారంభం
- 11 అంకెలతో ఫార్మర్‌ ఐడీ కేటాయింపు


దౌల్తాబాద్‌లో ఫార్మర్‌ రిజిస్ట్రీ నమోదు చేస్తున్న ఏఈఓ

దౌల్తాబాద్‌: రైతు(ఫార్మర్‌) రిజిస్ట్రీ అమలు ప్రక్రియను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. ఆధార్‌తో ప్రతి అన్నదాతకు 11 నంబర్లతో యూనిక్‌కోడ్‌(యూసీ) కేటాయించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్‌ చేయాలన్న సంకల్పంతో కేంద్రం రూపొందించిన ఫార్మర్‌ ఐడీ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5న శ్రీకారం చుట్టింది. మండల వ్యాప్తంగా ఉన్న భూ యజమానులకు విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయనున్నారు. వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్‌ రూపంలో పొందుపర్చనున్నారు.

రైతులకు డిజిటల్‌ కార్డు

ఫార్మర్‌ ఐడీ ప్రాజెక్టు కింద అర్హులైన ప్రతీ రైతుకు 11 నంబర్ల యూనిక్‌ ఐడీ కేటాయిస్తున్నారు. ఇది వారికి అందించే డిజిటల్‌ గుర్తింపు కార్డు. ఆధార్‌తో లింకు అయి ఉంటుంది. ఈ 11 అంకెల ఐడీలో రైతు పేరు, ఆధార్‌, మొబైల్‌ నంబరు, పట్టాదారు పాసు పుస్తకం వివరాలు, భూమి రకం, సర్వే నంబర్లు, సాగు చేసిన పంటల తదితర సమాచారం నమోదు చేస్తారు. ఈ ఐడీ ద్వారా రైతు సాగు వివరాల చిట్టా అంతా ఒకే క్లిక్‌తో తెలుసుకోవచ్చు. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్‌ సమ్మాన్‌ నిధి, ఫసల్‌ బీమా యోజన వంటి పథకాలకు ఇది తప్పనిసరి కానుంది. ప్రస్తుతం భూయజమానులకే మాత్రమే ఫార్మర్‌ రిజిస్ట్రీ జరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే భూ యజమానులు తప్పనిసరిగా ఈ ఫార్మర్‌ రిజిస్ట్రీలో నమోదు చేయాల్సిందే. కాగా తమకు అవకాశం ఇవ్వలేదని కౌలు రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ప్రయోజనాలెన్నో

ప్రతీ రైతుకు జారీ చేసే యూనిక్‌ ఐడీకి ఆయా రైతులు సీజన్‌లో పొందే సబ్సిడీలు, రుణాలు పంటబీమా వంటి పథకాలను అనుసంధానం చేస్తారు. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు ఈ ఐడీ ఉపకరిస్తుంది. ఈ ఐడీ సాయంతో దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, బకాయిలు ప్రభుత్వ పథకాల జమ వంటి వివరాలను క్షణాల్లో తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఫార్మర్‌ ఐడీ ద్వారా కేంద్ర పథకాల ప్రయోజనాలు వేగంగా పారదర్శకంగా అందుతాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ఐడీ నంబర్‌ ఎంటర్‌ చేస్తే రైతు సాగు వివరాలు తెలుస్తాయి.

ఏఈఓల వద్ద రిజిస్ట్రేషన్‌

రైతులు ఆధార్‌ కార్డు, పట్టాదారు పాసు బుక్‌, మొబైల్‌ నంబరుతో స్థానిక ఏఈఓను సంప్రదించాలి. అలాగే భూ వివరాలు, సాగు చేసిన పంటల సమాచారాన్ని అందించాలి. ఈ వివరాలను వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. యాప్‌లో వివరాలు ఎంటర్‌ చేసిన తర్వాత రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్‌ చేసిన తర్వాత 11 సంఖ్య ఫార్మర్‌ రిజిస్ట్రీ నంబర్‌ జనరేట్‌ అవుతుంది. నంబర్‌తో కూడిన మెసేజ్‌ రైతు మొబైల్‌కు వెళ్లడంతో ప్రక్రియ పూర్తవుతుంది. మండలంలోని ఏఈఓలు వ్యవసాయ క్లస్టర్ల వద్ద ఈనెల 5 నుంచి రైతుల వద్దకు వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ నెల 31లోపు అర్హులైన రైతులందరికీ ఫార్మర్‌ రిజిస్ట్రీ నంబర్‌ను జనరేట్‌ చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

నమోదు చేస్తున్నాం

మండలంలోని అన్ని వ్యవసాయ క్లస్టర్లలో ఫార్మర్‌ రిజిస్ట్రీ నంబర్‌ నమోదు చేస్తున్నాం. అర్హులైన రైతులందరూ ఫార్మర్‌ రిజిస్ట్రీ చేసుకోవాలి. వారి సందేహాలు ఉంటే ఏఈఓలను సంప్రదించాలి.
– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్‌

దారి కాసిన మృత్యువు
డీసీఎంను ఢీకొని యువకుడి దుర్మరణం


కార్తీక్‌ (ఫైల్‌)

అనంతగిరి: ప్రమాదంలో దెబ్బతిన్న డీసీఎం ఆ యువకుడి పాలిట యమపాశమైంది. ఆగి ఉన్న వాహనాన్ని గమనించక బైక్‌తో ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాద సంఘటన వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్‌ పరిధిలోని హైదరాబాద్‌ రోడ్డులోని కొత్రెపల్లి సమీపంలో రాత్రి 11 గంటలకు ఓ కారు, డీసీఎం ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతినడంతో అక్కడే వదిలి పెట్టారు. డీసీఎం కొంతభాగం రోడ్డుపైనే నిలిపారు. గంట వ్యవధిలోనే నవాబుపేట మండలం ఎక్‌మామిడికి చెందిన కార్తీక్‌ ముదిరాజ్‌ తన బుల్లెట్‌ బండిపై మన్నెగూడ వైపు వెళ్తున్నారు. కాగా కొత్రెపల్లి సమీపంలో ఆగి ఉన్న డీసీఎంను గమనించక పోవడంతో వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కార్తీక్‌ తలకు తీవ్ర గాయాలై కొట్టు మిట్టాడుతూ మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీంకుమార్‌ తెలిపారు. ఇదిలా ఉండగా ముందుగా జరిగిన ప్రమాదంలో వాహనాన్ని రోడ్డుపై నిలపడంతోనే ఈ ఘోరంజరిగిందని స్థానికులు వాపోతున్నారు.